# పుట్టింటోరి నెవిలి

ఎప్పటి సంగతి! లింగారెడ్డి తాత చిన్నతనంలో గెద్దాడ అడవి కడుపులో ఉండేది. గుడిశలో ఎప్పుడూ మండుతూ చిన్న దుంగలు, రాత్రిళ్లు తరచుగా పులిగాండ్రింపులు, బోలెడుతేనె, అడవి దుంపలు, శీతువులో జీలుగు చెట్టుకింద కడుపునిండా వెచ్చగా కమ్మటి జీలుగు కల్లు. పోడు చేసినా చెయ్యకపోయినా కూటికి కొరత లేదు.

లింగారెడ్డి తాత చూచాయగా గుర్తు. ఒకరోజు ఉదయం తండ్రి ఏడుపుతో చటుక్కున మెలకువ వచ్చింది. ముసిలోడు నిద్దర్లో వెళ్లేపోయాడు. ఆడుపోయి ఎన్నేళ్లయిందబ్బా! లింగారెడ్డి మనసేం బాగులేదు. చాలా ఏళ్ల నుంచి బాగా లేదు. మొల చుట్లూ తువాలు మరోసారి బిగించుకుని బీడీ ముక్కని మరోసారి వెలిగించాడు. కరీం, మిగిలిన డికాషన్‌లో మరికాసిని నీళ్లు పోస్తున్నాడు. నిప్పు ఊది ఎర్రగా వెలిగించాడతను. కళ్లు తుడుచుకుంటూ బెంచీమీద కూచున్న రెడ్డిని చూశాడు. ఆ చూపులకి అర్థం తెలిసిపోయింది ఉదయం నుంచీ 'రెంటీలు' అప్పు తాగేవు, మూడో టీ ఉండదని, బీడీ అవతల పారేశాడు రెడ్డి.

సాయంత్రం నాలుగవుతోంది. చైత్రమాసపు ఎండనాపడానికి అడవీ లేదు చెట్లూ లేవు. కడుపుపోయిన అడవి బిడ్డలాటి ఊరు గెద్దాడ. ఇప్పుడు వేటలేదు, మామూలు పిట్టలు కూడా దొరకడం లేదు. ఉన్న ఇరవై కొండరెడ్ల కొంపల్లో చూరులో గుచ్చిన బాణాలు అమ్ములు డోకీ డొక్కు వేలాడుతూ మిగిలిపోయాయి. కరీం దిగువ నుంచి ఒచ్చి టీ కొట్టు పెట్టుకున్నాడు. అవతల సుబ్రమణ్యాం ఎలమంచిలి కోమటి. ఇద్దరు పిల్లలు. చిన్న పిల్ల ఇక్కడే కడుపులో పడింది. పురిటికి పుట్టింటికి వెళ్లింది లక్ష్మి. సుబ్రమణ్యాం ఒంటిగాడు. పెంటారెడ్డిపెళ్లాం అతనికి కొత్తగాడు. రెడ్డిజబ్బు చేసి పోయి చాలా కాలమైంది. పనీపాటా చేసుకుంటూ చిన్న పుల్లల మోపులు కట్టి రోడ్డు మీద అమ్ముకుంటుంది. వరసగా నాలుగు రోజులు టీ పొట్టం అప్పుకోసం రావడంతో మొదలైంది. ("టీ పొడుం పట్టుకుపోడం తెలిసిందిగానీ టీ గట్టా ఇవ్వడం తెల్దా?") సాయంకాలాలు ఆమె ఇంటో టీ తాగడం, తరువాత తెల్లారే వరకూ అక్కడే ఉండిపోవడంతో ముదిరిపోయింది. బిడ్డతో తిరిగొచ్చి లక్ష్మి నానా యాగీ చేసి పుట్టింటికి వెళ్లిపోయింది.

బీడీ కూడాలేదు. బెంచీ మీద గొంతుక్కూచుని నేలని చూపుల్తో పెళ్లగిస్తున్నాడు లింగారెడ్డి. కరీం చిన్న రేడియో తిపి తిప్పి పాట వినబడగానే పెద్దదిచేసి సిగరెట్

వెలిగించాడు. ఇంచుమించు కిందపడ్డాడు రెడ్డి. సద్దుకుని కోపంగానే చూశాడుగానీ అతనికళ్లలో తేమ మినహా ఏవీ కనిపించలేదు. సాయంత్రపు స్తబ్ధతలో కరీం రేడియో పాట అపశ్రుతిలా అలముకుంటోంది. పుల్రెడ్డి భార్య టీ కోసం వచ్చింది. ఆమె టీ తాగుతుంటే లింగారెడ్డి అశాంతి ఇంకా ఎక్కువైపోయింది. రెడ్డి మనసేం బాగాలేదు. కొడుకు ఇంట్లో లేడు, చోడవరం కూలికెళ్లేడు. కడదుపు ఖాళీ కుండలా ఉంది. అతని నరాలకి జీవశక్తినిచ్చే ఔషధం లింగారెడ్డితమ్ముడి కొడుకు ఇంట్లో తయారవుతూంటుంది. దప్పిగొన్నవాళ్లందరూ వెనక వసారాలోకి వెళ్లి వస్తూంటారు. లింగారెడ్డికి తమ్ముడి కొడుకయినా ఈ విషయంలో నిక్కచ్చి. ఎంత బతిమాలుకున్నా ఉన్న బాకీ తీరిస్తేగాని అప్పు సారా పొయ్యను పొమ్మన్నాడు. రెడ్డికి విపరీతంగా కోపం వచ్చి నానా తిట్లు తిట్టినా ప్రయోజనం లేకపోయింది. రెండు రోజుల నుంచీ నకనక లాడిపోతున్నాడు. కొడుకు కూడా ఈమధ్య డబ్బులు విదల్చడం తగ్గించాడు. క్రితం ఏడాది వరకూ లోపలికి వెళ్లి నాలుగుకొమ్మలు నరికి పుల్లల మోపులు తెచ్చి అమ్ముకునేవాడు. రోడ్డు పక్కనే మోపులు పెట్టుకుని కడుపులో నాలుగు గ్లాసులు నింపుకుని కూచుంటే చీకటపడేప్పటికి కోడలు తిట్టకుండా కూడు పెట్టడానికీ ఉదయం రెండు గ్లాసులకీ సరిపోతూనే ఉండేది. సరిగ్గా క్రితం సంవత్సరం ఎండలు అడవిలోకి ఒచ్చేసరికి లింగారెడ్డితో సహా ఆ 'వీధి'లో అందరికి అతిసారం తగులుకుంది. రెడ్డి జేజల్లో కలిసిపోయేవాడే. ఇంకా కొన్నాళ్లు తమ్ముడి కొడుకు వసారాలో కూచుని సేవించమని గంగమ్మ ఆదేశించడంతో మిగిలిపోయాడు. కానీ ఎందుకనో మనిషి వింటిబద్దలా ఒంగిపోయాడు. పుల్లలు తెచ్చుకునే ఓపిక ఇగిరిపోయింది. కోడలు బాపనమ్మ కూడా పట్టించుకోడం మానేసింది. ("ఒచ్చే ఎండ్లకీడు ఉంతడో లేడో")

లింగారెడ్డి తలెత్తి చేశాడు. కరీం కొట్టుకి కొంచెం అవతల రోడ్డుకి దిగువగా రెడ్డి ఇల్లు లేదా ప్రస్తుత హోదాలో బాపనమ్మ గుడిశ. దువ్వుకుంటున్న దువ్వెన కొప్పులో గుచ్చుకుని కరీం కొట్టువేపొస్తోంది బాపనమ్మ. ఎలుగు మీదపడ్డట్టయింది లింగారెడ్డికి. మూడేళ్ల క్రితం అయితే ఒక్క ఉదుటున లేచి వెళ్లగలిగేవాడు. ఇప్పుడేం చెయ్యలేక మళ్లీ తలొంచుకుని కూచున్నాడు. దూరం నుంచే చూసింది బాపనమ్మ. తిన్నగా కరీం దగ్గరికొచ్చి అంది.

"అన్నా పందార ఎక్కువేసి టీజెయ్యి తల పగిలిపోతా ఉంది."

టీ తీసుకొని కొట్టు అవతల పక్కకి వెళ్లి నుంచుంది బాపనమ్మ. కరీ మళ్లీ సిగరెట్టు వెలిగించాడు. టీకి డబ్బులిచ్చేటప్పుడు మాత్రం రెడ్డిని చూస్తూ ఇచ్చి వెళ్లిపోయింది కోడలు. లింగారెడ్డికి ఎక్కడలేని కోపం వచ్చింది. చూరులో వింటిబద్దలాగి బాపనమ్మ వీపు చిట్లగొడదామనిపించింది. రేడియో బద్దలయ్యేట్టుగా వస్తున్న పాటలు అతనికి రుచించలేదు.

బాపనమ్మ మీద కసి అంతా రేడియో మీదికి మళ్లింది. అలాగే రేడియో వేపూ కరీం వేపూ చూస్తూ ఉండిపోయాడు. చూసి చూసి తుపుక్కున ఊశాడు రెడ్డి. కానీ కరీం రేడియో పాటతోపాటు పాడుతూ రెడ్డి ఉనికిని గుర్తించలేదు. రోడ్డు మీద ఏదో జీప్ ఆగింది. రెండు పుల్లల మోపులు పడేసుకుని వెళ్లిపోయింది. ఇంక లింగారెడ్డి ఉండలేకపోయాడు. అతని ముక్కుపుటాలకి పులుపువాసన తగుల్తోంది. కడుపులో పేగులు తడి తగలక బావురుమంటున్నాయి. బెంచీ దిగి చేతి కఱ్ఱ తీసుకుని ఆఖరిసారి బతిమాలడానికి తమ్ముడి కొడుకు దగ్గిరికి బయలుదేరాడు. లింగారెడ్డి సాధ్యమైనంత వేగంగా వెళ్లడం కూడా చూడలేదు కరీం.

గుమ్మంలో కాళ్లు బారచాపుకుని కూచుంది. బాపనమ్మ. మర్నాడు సంత. బాపనమ్మకి ఏడుపొచ్చింది. ఇవాళ మధ్యాన్నం బస్సుకి వస్తానన్నవాడు రానేలేదు. అతను చోడవరం ఎందుకెళ్లినా బాపనమ్మకి అనుమానమే. ఏ ముండ మొహానో డబ్బులు తగలేసి, రోజా సినిమా, షాపుసారా తాగి ఒస్తూంటాడు. రాగానే డబ్బులు లాక్కుంటుంది. అప్పుడు నాలుగు కేకలు వేసి ఊరుకుంటాడు. సాయంత్రానికి కడుపు నింపుకుని ఒచ్చి పెళ్లాన్ని చితకబాది దానిచేత నాలుగు తన్నులు తిని ఇద్దరూ అరుచుకుని ఒకళ్ల బట్టలు ఒకళ్లు చింపుకుని అలిసి పడుకుంటారు. సాయంత్రం అయేకొద్దీ బాపనమ్మకి గుబులు ఎక్కువైంది. "ఆడీపూట రాడ"ని తేలిపోయింది. మొగుడిమీద కోపంతో ఏడుపొచ్చిందామెకి, చటుక్కున లోపలికెళ్లి సత్తు చెంబులో రహస్యంగా దాచుకున్న గ్లాసెడూ తాగి మళ్లీ గుమ్మంలోకొచ్చి కూచుంది.

తల్లి వెంటే తిరుగుతూ ఇంటి ముందు కోడిపిల్లలు కిచకిచమంటున్నాయి. చటుక్కున మరోవేపు చూసింది బాపనమ్మ. మరోకోడి ఎండలో పరాధ్యానంగా కూచునుంది. నిన్నట్నించీ తెగులుసోకి అలాగే ఉండిపోయిందది. దానివేపే చూస్తూ కూచుందామె. బంగారంలాంటి కోడి. బలంగా ఎత్తరి. మందకొడిగా పడుందిపప్పుడు. ఆమె చూపులతో దానికి కదలిక వచ్చి ఓపిగ్గా లింగారెడ్డిలా లేచింది. మెల్లిగా అటూ ఇటూ తిరుగుతూ పడుతూ లేస్తూ బాపనమ్మ దగ్గిరికి వచ్చింది.. దగ్గిరికి తీసుకుని చూసి రేపట్టికి బతుకుద్దా అనుకుందామె. బుట్ట కింద నుంచి తీసి వదిలేసింది నిన్న. ఎప్పుడో పుల్లలు తీసుకొని ఇంటికొచ్చిం తరువాత గానీ కోడి సంగతి చూసుకోలేదు. గువ్వలా చూరుకింద కూచునుంది. చేతిలోకి తీసుకుని కాసిని నీళ్లు తాపించింది బాపనమ్మ. కాసేపు కూచుని ఎండలోకి బయల్దేరింది. నిండుగా బలంగా రాణిలా ఉండేకోడి ఇప్పుడు మలేరియా తగిలిన రాణిగారిలా ఉంది. రెండ్రోజులు బతికించమని గంగమ్మకి దణ్ణం పెట్టుకుంది బాపనమ్మ. దడిపక్క నుంచి రోడ్డు మీదికి వెడుతూ కోడిని చూశాడు ఆదిరెడ్డి.

"అక్కా, కోడికేమయింది?"

లోపలికొచ్చి కోడిని పట్టుకు చూశాడు రెడ్డి. పెదవి విరిచి మెల్లిగా దించి గొణుక్కుంటూ వెళ్లిపోయాడు. ఏం చెయ్యాలో తోచలేదు బాపనమ్మకి. రోగం అన్ని కోళ్లకీ తగులుకుంటుంది. రెండ్రోజులు దాని 'పేనం' కాపాడుకుంటే రెడ్డి ఎలాగూ వస్తాడు. ఈ లోపల గుటుక్కుమంటే కోడి దక్కదు. తనకి వీపు మీద దెబ్బలు తప్పవు. అసలు బాపనమ్మకి మనసేం బాగోలేదు. నెమలిలా ఉండే కోడికి తెగులు సోకిందని ఒక బాధ. రేపు సంత బాధ. అంతకు ముందు ఆదివారం మొగుడూ పెళ్లాలిద్దరూ సంతకెళ్లేరు. గంపలో పనసకాయలు మధ్యాన్నానికి అమ్మేశారు. సంత హోటల్లో ఇద్దరూ ఉల్లి దోశలు తిని టీ తాగి వీధిలో(గ్రామంలో) వాళ్లతో బయటపడ్డారు. బాపనమ్మ వీధి ఆడంగులతో కబుర్లలో పడింది. బాపనమ్మ అన్న ఒచ్చి బావగార్ని లాక్కుపోయాడు. సంతపాకల వెనక గెడ్డ ఒడ్డునే చెట్ల కింద రహస్యంగా చలివేంద్రం ప్రతి సంతరోజు తెరిచి ఉంటుంది. సంత పల్చబడిపోయింది. జంతికలు, జిలేబీల కొట్లముందు జనం తక్కువ ఈగలెక్కువగా ఉన్నాయి. రిబ్బన్లు, రవిక గుడ్డలు, గాజుల దుకాణం దగ్గిర మాత్రం ఆడంగులు పోగై బోట్టు బిళ్లల దగ్గిర్నించీ అద్దాల వరకూ అన్నీ బేరాలాడుతున్నారు. వాసన నూనె సీసాల దగ్గిర కట్టేసినట్లు ఉండిపోయారు. పలకలుగాచక్కటి సీసా. సీసాచేతిలోకి తీసుకుని నివురుతూ గోకవరం షావుకారుతో బేరం మొదలుపెట్టేరు. షావుకారు కొత్తగాడు. ఎన్నో ఏళ్ల నుంచీ వచ్చేవాడే. చాలాకాలం వరకూ డబ్బుకి బదులుగా పనసలు, తేనె, దుంపలు ఏదిదొరికితే అది తీసుకుని అద్దం, దువ్వెనలు, రంగు కుంకం డబ్బాలు ఇస్తూండేవాడు. ఇప్పుడంతా అమ్మడం కొనడం డబ్బుతోనే. బాపనమ్మని చూసి అన్నాడు.

"అది తీసుకో. సంపెంగ ఓసన. రాసుకుని కూకున్నావనుకో, రాత్రీ పగలూ నిన్నొదల్డు నీ మొగుడు. ఏడీ! గెడ్డ దగ్గిరికి పోయుంటాడు" అందరూ నవ్వేరు. లక్ష్మి సీసాని గట్టిగా పట్టుకుని ఉంది.

"ఎంతకిస్తావో చెప్పు. అబద్దాలాడకు"

లక్ష్మి, లక్ష్మి ఆడపడుచూ పాతిక రూపాయలకి బేరం ఆడి రెండు సీసాలు కొనుక్కున్నారు. 'నాకొద్దంది' బాపనమ్మ. కానీ కడుపులో దేవినట్టయింది. ఒదల్లేక ఒదల్లేక సీసా అక్కడే ఒదిలి వచ్చింది. సంత అయిపోయింది. తరవాత ఎంసేపటికో వచ్చేడు రెడ్డి. ఓ పొట్లం మిరపకాయబజ్జీలు బాపనమ్మ చేతిలో పెట్టేడు. మర్నాడు పనిగట్టుకుని లక్ష్మి ఇంటికెళ్లి గుండెనిండా నూనె వాసన నింపుకొచ్చింది బాపనమ్మ. రేపు సంతలో సీసా కొనుక్కోవడానికి డబ్బులిస్తానన్నాడు రెడ్డి. ఏడీ, మనిషీ లేదు డబ్బు లేదు. పైగా తెగులు సోకిన కోడి ఒకటి. ఇంక ఈ పూట రాడు. సంపాయించి డబ్బులు తగలేసొస్తాడు.

సు(బ్రమణ్యాన్ని అప్పు అడిగి లాభం లేదు. ఉప్పుకీ, నూనెకీ ఎలగూ రాసుకుంటున్నాడు. తూర్పు కనుమల్లో ఎవరూ బాపనమ్మకి డబ్బులిచ్చి వాసనన నూనె కొనిపెట్టేవారు లేరు. ఇంతలో లక్ష్మి నెత్తి మీద మోపుతో వెళ్తూ బాపనమ్మని చూసి ఆగింది. లక్ష్మి చూడగానే నూనెవాసన మళ్లీ గుప్పుమని జ్ఞాపకం ఒచ్చింది. పది నిముషాలు మాట్లాడి వెళ్లిపోయింది లక్ష్మి. ఉదయంలోగా పాతిక రూపాయలెవరిస్తారు? చిన్నెం రెడ్డి మీద ఉవ్వెత్తున మళ్లీ కసి పెరిగింది. చాలాసేపు గుమ్మం దగ్గిరే కూచుండిపోయింది బాపనమ్మ.

కాళ్ల దగ్గిర కోడి పిల్లలు కిచకిచమన్నాయి. చటుక్కున స్పృహలోకి వచ్చింది బాపమ్మ. దడి దగ్గిరా బొప్పాయిచెట్టు దగ్గిరా జబ్బుకోడి కనిపించలేదు. లేచి వెళ్లి గుడిశ వెనక చూసిందామె. అక్కడా లేదు. గంప వెనకా, దడి అవతలా చూసిందామె. కనిపించలేదు. ఏ కుక్కో చచ్చినదాన్ని ఈడుచుకుపోలేదు గందా, బాపనమ్మకి ఏం చెయ్యాలో తోచలేదు. చచ్చే కోడి రేపేనా చావొచ్చుగదా.

తలుపు చేరవేసి వీధిలోకి వచ్చింది అటూ ఇటూ చూసకుంటూ కరీం కొట్టు వరకు వచ్చింది బాపనమ్మ. ఎప్పుడొచ్చి కూలబడ్డాడో మళ్లీ లింగారెడ్డి కొట్టు ముందు బల్లమీద మామూలుగా నేలని పెళ్లగిస్తూ కనిపించాడు. కోడికేనా తెగులొచ్చి ఈడికి రాలేదనుకుంది బాపనమ్మ. కరీంకొట్టు  పక్కనుంచి అటూ ఇటూ పరికించింది. ఎక్కడా కనిపించలేదు. రోడ్డు మీదగ్గాని పోలేదు గదా.

"ఏటక్కా ఎతుకుతా ఉండావు?" అడిగాడు కరీం.

"కోడి అన్నా. జబ్బు చేసింది. ఇటేపు ఒచ్చినాదేమోనని"

లింగారెడ్డి చటుక్కున తల ఎత్తేడు.

"ఏడబోయింద కోడి?"

లింగారెడ్డి జబ్బుకోడిలా లేచేడు. కొట్టు అవతలి పక్కనుంచీ, చెయ్యి నడుం మీద పెట్టుకుని బాపనమ్మ ఒక వేపు, లింగారెడ్డి ఒక వేపూ చూసుకుంటూ రోడ్డు దగ్గిరికొచ్చేరు. ఎ(ర్రబస్సు కస్సుమంటూ ఆగింది. పందు దొర, పెళ్లాం దిగేరు. బస్సు వెళ్లిపోయింది. బాపనమ్మకి కోడినీ చెన్నెం రెడ్డినీ పీక పిసకాలనిపించింది. బస్సు మలుపు తిరిగేవరకూ చూస్తూ ఉండిపోయింది.

"ఓ అల్లదో" అరిచాడు లింగారెడ్డి. బాపనమ్మ చటుక్కున తలతిప్పి చూసింది. ఆమె నుంచున్న దగ్గిర్నుంచీ దూరంలో ఎవరిదో స్కూటరు ఆగి ఉంది. స్కూటరు వెనకనుంచి ఒక్కో అడుగే వేసుకుంటూ కోడి రోడ్డు వేపు నడుస్తోంది. దాన్ని చూడగానే బాపనమ్మకి గుండె కుదుటబడి అరుచుకుంటూ దగ్గిరికెళ్లింది.

"ఓరి ఓరి...." బాపనమ్మ వెనకనుంచి జీపు హారన్ మోగింది. వెనక్కి తిరిగి చూసిందామె. మళ్లీ హారన్ మోగింది. బాపనమ్మ కోడివేపు నడిచింది. హారన్ శబ్దానికి కోడి తల్లి కంగారుపడి రోడ్డు మధ్యకి నడిచింది. మరుక్షణంలో జీపు కీచుమంటూ ఆగింది. ముందు చక్రాల కింద కోడినలిగిపోయింది. లింగారెడ్డి క్షణం సేపు ఆగిపోయాడు. బాపనమ్మ అలాగే నుంచుండిపోయింది. జీపు ఆగిన శబ్దానికి కరీం గబగబ రోడ్డు మీదికొచ్చేడు.

"అక్కా నీ కోడేనా!" బాపనమ్మకి తెలివొచ్చింది. జీపు డ్రైవరు దిగేడు. ఈలోగా సుబ్రమణ్యం, ఆదిరెడ్డీ, రోడ్డుకి అవతల పక్కనున్న ఆడంగులూ అందరూ జీపు దగ్గిరికొచ్చేరు. లింగారెడ్డి గుండె గతుక్కుమంది. అదీ, తన పేగుల బాధ ఈ దెబ్బతో తీరిపోవాలి. చటుక్కున గుండెలు బాదుకుంటూ జీపు దగ్గిరికొచ్చేడు. బాపనమ్మకి ఒక్కక్షణంలో అర్థం అయింది. రెడ్డికంటే ముందు ఓలమ్మో, నా తల్లే అని అరుచుకుంటూ జీపు దగ్గిరికొచ్చింది. అందరూ డ్రైవర్ని చుట్టుముట్టేరు. లింగారెడ్డి తల పట్టుకుని కోడి శవం పక్కన కూలబడ్డాడు. తల కొట్టుకుంటూ కాసిని బూతులూ, మరణించిన కోడి గుణగణాలూ పందెలో కోడి ప్రదర్శించిన వీరావేశం, మరిన్ని బూతులూ మొదలైన వాటితో రక్తి కట్టిస్తున్నాడు. లింగారెడ్డిని జీపు కిందికి తోద్దామనిపించింది బాపనమ్మకి. దొంగ తొత్తుకొడుకు, ఆడి ఏడుపెందుకో తనకి తెల్దా. ఏడుపులాటి ఆవేశంతో కోడి తనకి ఉన్న అనుబంధం, దాని అకాల మరణం వల్ల ఆమెకి కలిగిన నష్టం, భర్త తనని ఎన్ని రకాలుగా చంపుతాడో చుట్టూ ఉన్న సాటి అక్కలందరికీ విషాదభరితంగా వివరించింది. లింగారెడ్డి బలంగా ఊపిరి పీల్చుకుని లేచేడు. ఆడంగులందరూ జీపు డ్రైవర్ని అతని నిర్లక్ష్యాన్నీ వర్ణనాత్మకంగా శపిస్తున్నారు. అసలు మోటారు డ్రైవర్లు కోళ్లని చంపందే నిద్రపోరని తేలిపోయింది. కరీం కలిగించుకుని కోళ్లనే కాకుండా వాళ్లు మేకల్నీ మనుషుల్నీ కూడా చంపేసి వెళ్లిపోతూంటారని మాట అందించాడు. ఆదిరెడ్డి కొంతకాలం క్రితం వాళ్లకోడి అటువంటి కారు కిందే ఏ పరిస్థితుల్లో అకాల మరణం పొందిందో చెప్పి అన్నాడు.

"ఆడి దగ్గిర ఒందుచ్చుకున్నాను"

లింగారెడ్డి, బాపనమ్మా గతుక్కుమన్నారు. లింగారెడ్డి డ్రైవరు దగ్గిరికి బాపనమ్మ రాకుండా జాగ్రత్తపడుతున్నాడు అని దుఃఖాన్నిప్పుడు చేతుల ద్వారా కళ్లద్వారా చెప్పుకుంటున్నాడు. బాపనమ్మ ప్రదర్శన కూడా రెడ్డి కంటే ఎక్కువ రక్తి కడుతోంది. కోడి పక్కన కూలబడిపోయింది ఆడవాళ్లందరూ ఆమె పక్షం చేరేరు. ఈలోగా జీపులోంచి దిగిన నలుగుర్నీ ఎవరూ మాటాడనివ్వలేదు. ఈ గొడవలోనే డ్రైవరు సిగరెట్టు వెలిగించాడు. బాపనమ్మ ఒక్క ఉదుటున చేరి కరీంతో మొరపెట్టుకుంది.

"ఇది నా పుట్టింటోరి నెవిలి నా పేనం. నన్ను సంపినా బాగుండేది. అన్నా నువు చెప్పు ఇది నా పేనవా కాదా?"

కరీం తల ఊపేడు. మళ్లీ అందరూ నోరు చేసుకున్నారు. లింగారెడ్డి డ్రైవరు చెయ్యిలాగి చచ్చిపోయిన కోడిని ఎలా పెంచుకున్నాడో, పందెంకోసం ప్రాణప్రదంగా ఎలా కాపాడు కుంటున్నాడో చెప్పుకున్నాడు. తల బాదుకున్నాడు.

"ముసిలి కొడుకుని నన్ను సంపినా ఏవైతది?"

"నా పుట్టింటి నెవిల్ని సంపేసినాడు తల్లీ.. నా మొగుడు నన్ను బతకనీడు. నా పేనం కూడా తీసేసుకో బావూ" డ్రైవరు బాపనమ్మ దగ్గిరికి వెళ్లక తప్పలేదు. లింగారెడ్డి వెంటనే ఆమెకీ డ్రైవరుకీ మధ్యకొచ్చేడు.

'నువుండే, ఆడంగివి. నే మాతాడతండా గదా'

బాపనమ్మకి అర్థమైపోయింది. లింగారెడ్డి పక్కకి ఒచ్చి నుంచుంది. కోడి శవం పక్కన కూలబడాలనిపించింది. గానీ లింగారెడ్డిని నమ్మడానికి వీల్లేదని నిర్ణయించుకుని కళ్లు తుడుచుకుంటూ నిశ్శబ్దంగా గుండెలు బాదుకుంటూ ఉండిపోయింది బాపనమ్మ. జనాన్ని తోసుకుంటూ వచ్చి సుబ్రమణ్యం అన్నాడు.

"గొడవేటండీ"

"అన్నా నువుజెప్పు నా తల్లిని చంపేసినాడు"

లింగారెడ్డి కూడా ఏదో అనబోయాడు. డ్రైవరు మొదటిసారిగా నోరు విప్పేడు. "కోడి కారు కిందపడిందండి. నేనేం స్పీడుగా రావడం లేదు. సర్లెండి పొరపాటు నాదే అనుకోండి మీరేదేనా చెప్తే ఇచ్చి వెళ్లిపోతాం. పోయిన కోడిని ఇవ్వలేం గదా! ఏం జరిగిందో ఈళ్లు కొంతమంది చూశారనుకోండి"

"మరింకేటక్కా! పొరపాటయిపోయింది గొడవబడి లాబం ఏవుంది? చెప్తునాడుగా ఆయన! నేనో మాటంటాను. ఆ మాట ప్రకారంగా మరిమీరు ఇంటే బావుంటుంది."

"ఇంక అనేదేటి, అంతే" అన్నాడు కరీం.

లింగారెడ్డి సుబ్రమణ్యం బుజం మీద చెయ్యివేసి అరచేత్తో గుండె రాసుకుంటూ చచ్చిన కోడి వేపు చూస్తూ విషాదంగా తల అడ్డంగా ఊపుతున్నాడు. కరీంకీ, సుబ్రమణ్యానికీ సమస్య వెంటనే అర్థం అయిపోయింది. లింగారెడ్డిని ఒదిలించుకుంటూ మరో అడుగు ముందుకేశాడతను. "నువ్వేం జెస్తే అదే అన్నా" అంది బాపనమ్మ. వాసన నూనె స్పష్టంగా ఆమె ముక్కుపుటాలకి తగుల్తోంది. రేపు సంత ఖాయం. లింగారెడ్డికి సుబ్రమణ్యం

మీదనమ్మకం లేదు. నోటి దగ్గిర గ్లాసు లాగేసుకున్నట్టయింది. "సరే డ్రైవరుగారూ బంగారంటాంటి కోడి అయితే చచ్చేపోయింది. ఇంకా గొడవాదిలేసి ఓ యాభై రూపాయ లిప్పించండి, నేను సర్దుబాటు చేసుకుంటాను."

డ్రైవరు మళ్లీ ఏదో అనబోయాడు. ఎందుకేనా మంచిదని బాపనమ్మ ఒకసారి ఏడిచి గుండెలు బాదుకుంది. వెంటనే లింగారెడ్డి డ్రైవరు దగ్గిరికి జరిగేడు. ఆకాశం వేపుచూసి దణ్ణం పెట్టుకున్నాడు. జీపులో ఉన్న నలుగుర్లో ఒకతను డ్రైవర్ని ఆగమని సంజ్ఞ చేసి జేబులోంచి యాభై నోటు తీసి డ్రైవరికిచ్చాడు. బాపనమ్మ గుండె గాలిలో యాభై నోటులా రెపరెపలాడింది. లింగారెడ్డి గొంతు తడారిపోయింది. డ్రైవరు నోటు అందుకోగానే లింగారెడ్డి నమస్కారం పెట్టి అతని భుజం మీద చెయ్యివేశాడు. మరో చెయ్యి లేచేలాగా, బాపనమ్మ చెయ్యిచాపేలోగా సుబ్రమణ్యం నోటు అందుకున్నాడు. లింగారెడ్డి వెంటనే అతనిచేతిని ఆప్యాయంగా పట్టుకున్నాడు. నోటు జేబులో వేసుకున్నాడు సుబ్రమణ్యం, మరో నిముషంలోజీపు వెళ్లిపోయింది. గుంపు చెదిరిపోయింది. కరీం నవ్వుకుంటూ రోడ్డు దిగి కొట్టువేపు నడిచాడు.

"రా అక్కా కోట్టో లెక్క చూసి, టీకీ గట్టా ఇవ్వాలిగదా. అదితీసుకుని మిగతాదినీకో ఆడికో ఇచ్చేత్తాను" అంటూ వెనక్కి తిరిగేడు సుబ్రమణ్యం. లింగారెడ్డీ, బాపనమ్మ అతని వెంట బయల్దేరేరు.

❖ ❖ ❖